సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం । 17 । ఆగస్టు । 2024



నేడు గండిలో శ్రావణ శనివారోత్సవం

గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో నేడు రెండో శ్రావణమాస శనివారోత్సవం జరగనుంది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ వర్గాలు ఏర్పాట్లు చేశారు. -8లో



మైలవరానికి గండికోట నీరు ఎప్పుడో!

శ్రీశైలం ప్రాజెక్టుకు వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం అవుకు జలాశయం నుంచి రోజూ గండికోట ప్రాజెక్టుకు 11 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.230	రూ.300
రెండోరకం	రూ.150	రూ.220

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 403 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

విద్యార్థులకు పురస్కారం


విజయవాడలో జరిగిన పరేడ్‌లో పాల్గొన్న విద్యార్థులు

గాలివీడు: విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో నూలివీడు హైస్కూల్ విద్యార్థినులు టి.భవిత, ఎస్. నసీబ్‌లు పాల్గొన్నారు. వీరు 15 రోజుల శిక్షణాంతరం రాయలసీమ జోన్ నుంచి రాష్ట్రస్థాయి భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌కు కమాండర్‌గా ఎంపికయ్యారు. వీరికి రాష్ట్ర డీజీపీ చేతులమీదుగా ప్రశంసాపత్రాలను అందుకున్నట్లు పాఠశాల స్కౌట్ మాస్టర్ కరకోటి చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల చరిత్రలో మొదటి సారిగా రాష్ట్రస్థాయిలో ఇంతటి ప్రతిభ కనబర్చడం గర్వకారణం అన్నారు. విద్యార్థులు, స్కౌట్ మాస్టర్ చంద్రశేఖర్‌కు ఎస్ఎంసీ చైర్మన్ వేల్పుల జనార్దన్, హెడ్‌మాస్టర్ శ్రీనివాసులు అభినందనలు తెలియజేశారు.

రేపు పీబీసీకి నీరు విడుదల

లింగాల: పీబీసీ కెనాల్‌కు ఆదివారం నీరు విడుదల చేస్తున్నామని సీబీఆర్ ఈఈ రాజశేఖర్ తెలిపారు. సీబీఆర్ నుంచి కాకుండా గడ్డంవారిపల్లె వద్దనున్న 4వ ఎత్తిపోతల పథకాన్ని మొదలుపెట్టి అక్కడి నుంచి గొడ్డుమర్రి ఆనకట్ట వరకు నీటిని పంపింగ్ చేసి గొడ్డుమర్రి ఆనకట్ట నుంచి పీబీసీకి నీరు విడుదల చేస్తున్నామని చెప్పారు. రోజుకు 100క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేస్తామన్నారు. గడ్డంవారిపల్లె వద్ద చెరువులో నీరు నిల్వ ఉన్నందున మొదట ఆ లిఫ్టును, తర్వాత 3, 2, 1ఎత్తిపోతల పథకాలను ప్రారంభించి గండికోట నుంచి నీరు ఎత్తిపోతల పథకాల ద్వారా సీబీఆర్‌కు తరలించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం సీబీఆర్ వద్ద ఉన్న లింగాల కుడికాలువ గేట్ల వద్ద మరమ్మతు పనులు నిర్వహిస్తున్నందున లింగాల కుడికాలువకు నీరు విడుదల ఆలస్యమవుతుందన్నారు. 4, 5 రోజుల్లో విడుదల చేస్తామన్నారు.

సీఐల నియామకం

రాయచోటి: అన్నమయ్య జిల్లా పరిధిలో సీఐల నియామకం జరిగింది. కర్నూల్ రేంజ్ డిఐజీ కోయ ప్రవీణ్ సీఐలను బదిలీలు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు వెలువరించారు. శంకరయ్యను ఆర్ఎస్‌టీఎఫ్ (ఎస్పీ కార్యాలయానికి), వేణుగోపాల్ సైబర్ సెల్ (ఎస్పీ కార్యాలయానికి), శేషయ్యను ఆర్ఎస్ఏఎస్‌టీఎఫ్‌కు, లక్ష్మీనారాయణ, దిశా–2, మదనపల్లి ట్రాఫిక్ కు, మంజునాథ్ రెడ్డి, సోషల్ మీడియా అండ్ సైబర్ క్రైమ్ సెల్‌కు నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఆన్‌లైన్ డేటాను వేగవంతం చేయాలి


డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

వీరబల్లి: సహకార సంఘం కార్యాలయంలో ఆన్‌లైన్ డేటాను వేగవంతం చేయాలని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. శుక్రవారం ఆయన వీరబల్లి మండల కేంద్రంలో ఉన్న సహకార సంఘం కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. డేటా ఎంట్రీ ఎలా చేయాలనే అంశంపై సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రావణి, ఇన్‌చార్జి ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, సహకార బ్యాంక్ చీఫ్ మేనేజర్ ముంతాజ్ బేగం, సహకార అధికారి హబీబుల్లా, సూపర్ వైజర్ రెడ్డి శేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో ప్రజల మన్ననలు పొందాలి


స్టాఫ్ నర్సులుగా నియమితులైన వారితో ఆర్డీ శ్రీనివాసులు తదితరులు

కడప రూరల్: స్టాఫ్ నర్సులు విధి నిర్వహణలో ప్రజల మన్ననలు పొందాలని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్–4) రీజనల్ డైరెక్టర్ డాక్టర్ వై శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కడపలోని కార్యాలయంలో 50 మందికి స్టాఫ్ నర్స్ నియామకాల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాఫ్ నర్సుల వృత్తి పవిత్రమైందని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరిండెంట్ గోపాల్‌రెడ్డి సీనియర్ అసిస్టెంట్స్ అతావుల్లా, బత్తనయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


రాయచోటిలోని శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

వరలక్ష్మీ పాహిమాం

వరలక్ష్మీ వ్రతాన్ని జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇళ్లలోనూ వైభవంగా వ్రతాలు ఆచరించారు. ఆనందం, సంపద, శ్రేయస్సు వంటి వరాలను ప్రసాదించాలని లక్ష్మీదేవిని ప్రార్థించారు.జిల్లాలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

–సాక్షి నెట్‌వర్క్


వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న భక్తులు

కరువునేలపై కృష్ణమ్మ పారేనా!

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 3 సార్లు కృష్ణాజలాల తరలింపు
- కుప్పం నియోజకవర్గానికి రాక, 3 చెరువులకు నీళ్లు
- ప్రస్తుతం కరువు పరిస్థితులు, దారుణంగా పడిపోయిన సాగు విస్తీర్ణం
- కృష్ణా జలాల కోసం రైతుల ఎదురుచూపు


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పుంగనూరు ఉపకాలువలో కృష్ణా జలాల ప్రవాహం (ఫైల్)

బి.కొత్తకోట: జిల్లాపై కరువు మేఘాలు కమ్ముకున్నాయి, ఖరీఫ్ సాగు పడకేసింది. తీవ్ర వర్షాభావం, పంటల సాగు లేకపోవడంతో సేద్యం కుదేలైంది. దీంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రస్తుత కూటమి సర్కార్ చేపట్టి ఊరట కలిగించాలని రైతాంగం కోరుతోంది. 2019 జనవరిలో ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అప్పటి టీడీపీ ప్రభుత్వం చేపట్టిన నామమాత్రపు జలాల తరలింపు కాకుండా చెరువులకు నీటిని మళ్లించాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో కరువు పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. 30 మండలాల్లో ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం కాలేదు. జూన్‌లో ఆశించిన వర్షాలు కురిసినా, జూలై, ఆగస్టులో పరిస్థితులు దారుణమయ్యాయి. జూన్‌లో సగటు 75.1 మిల్లీమీటర్లకు అత్యధికంగా 160.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జూలైలో సగటు 90.5 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 47.5 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. ఆగస్టులోనూ వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. జిల్లాలో మొత్తం వేరుశనగ సహా అన్ని పంటలు 54,935 హెక్టార్లలో పంటలు సాగు కావాల్సి ఉండగా ఇంతవరకు 13,002 హెక్టార్లలోనే సాగయ్యాయి. మిగిలిన 41,933 హెక్టార్లలో పోలాలన్నీ బీళ్లుగా కనిపిస్తున్నాయి. వర్షంలేక చెరువులు ఖాళీగా ఉన్నాయి. భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి.

టీడీపీ పాలనలో..

- హంద్రీనీవా పుంగనూరు ఉపకాలువ ద్వారా జిల్లాలోకి కృష్ణా జలాలను తరలించారు. 2019 జనవరి 21 ప్రారంభించి ఏప్రిల్ 11 వరకు జలాలను తరలించి ఆర్భాటం చేసినా కేవలం 775 ఎంసీఎఫ్‌టీలు పారించి చేతులు దులుపుకున్నారు.
- కాలువలో నీళ్లు పారించారేకాని ఒక్క చెరువుకు నీళ్లవ్వలేదు. తరలించిన నీళ్లన్నీ కాలువలో ప్రవాహానికే సరిపోయింది.
- దీనికోసం ప్రభుత్వ నిధులను ఖర్చు చేసి పెద్దతిప్పసముద్రంలో భారీ బహిరంగ సభ పెట్టారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో..

- హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా వైఎస్ జగన్ పాలనలో అన్నమయ్య, చిత్తూరుజిల్లాకు మూడుసార్లు కృష్ణా జలాలను తరలించారు.
- 2019 నవంబర్ 22 నుంచి మార్చి వరకు 1.34 టిఎంసిల నీళ్లు తరలించారు.
- 2020 నవంబర్ 12 నుంచి 2021 మే15 వరకు 2.5218 టీఎంసీల నీళ్లను తరలించగా అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో 91 చెరువులను నింపారు.
- కుప్పం ఉపకాలువసాగే వి.కోట మండలం వరకు తరలించారు.
- 2023 అక్టోబర్ 9 నుంచి 2024 మార్చి 5 వరకు 2.6 టీఎంసీల కృష్ణా జలాలను తరలించారు.
- మదనపల్లె, పుంగనూరు పట్టణాలకు తాగునీరు అందించే చిప్పిలి, గుంటివారిపల్లె, పుంగమ్మ సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులను కృష్ణా జలాలతో నింపారు.
- చిత్తూరుజిల్లా పలమనేరు నియోజకవర్గం శంకరాయలపేట చెరువుకు నీటిని తరలించారు.
- కుప్పం నియోజకవర్గంలోని మద్దికుంట, వెరశి చెరువు, శాంతిపురం మండలంలోని చిట్టివానికుంటలను నింపారు.
- ఈ మూడుసార్లలో 6.4618 టీఎంసీల నీళ్లు ఉమ్మడి చిత్తూరుజిల్లాకు చేరాయి.
- ఇంతచేసినా ప్రభుత్వ నిధులు పైసా ఖర్చు చేయకుండా, హడావుడి లేకుండా జలాలు పారించారు.

కృష్ణమ్మే దిక్కు

కరువు ప్రాంతానికి ఏకైక దిక్కు హంద్రీ–నీవా ప్రాజెక్టు, దాని ద్వారా శ్రీశైలం నుంచి తరలించే కృష్ణా జలాలే ప్రత్యామ్నాయం. శ్రీశైలం నుంచి తరలించే కృష్ణా జలాలను శ్రీసత్యసాయిజిల్లా కదిరి సమీపంలోని చెర్లోపల్లె జలాశయం నింపాక ఇక్కడినుంచి పుంగనూరు ఉపకాలువ (పీబీసీ)కు నీటిని విడుదల చేస్తే ఉమ్మడి చిత్తూరుజిల్లాకు కృష్ణా జలాలు ప్రవహిస్తాయి. జిల్లాలోని పెద్దతిప్పసముద్రం మండలం పులికల్లు గ్రామం మీదుగా ప్రవహించే పీబీసీ తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల మీదుగా చిత్తూరు జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గం నుంచి పలమనేరు నియోజకవర్గంలోని పెద్దపంజాణి వరకు సాగుతుంది. అక్కడినుంచి కుప్పానికి కుప్పం ఉపకాలువ సాగుతుంది. కృష్ణా జలాల తరలింపుపై ప్రభుత్వం తక్షణమే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటే ప్రజలు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడవచ్చు. లేదంటే ఇప్పటికే ఖరీఫ్ వర్షాభావంతో సేద్యానికి దూరమైన రైతులు ఇంకా నష్టపోవాల్సిన పరిస్థితులు కలుగుతాయి.

వచ్చే జనవరిలోనే



జిల్లాకు కృష్ణా జలాల తరలింపు ప్రస్తుతానికి లేదు. వచ్చే ఏడాది జనవరిలోనే ఉండొచ్చు. శ్రీశైలం నుంచి జలాన్ని తరలించే పరిస్థితులను బట్టి ఇక్కడికి నీటి తరలింపు ఉంటుంది. జనవరిలో కదిరి సమీపంలోని చెర్లోపల్లె రిజర్వాయర్‌కు నీటిని నింపుతారు. అక్కడినుంచి ఇక్కడికి తరలించాల్సి ఉంటుంది. దీనిపై ప్రణాళికను అమలు చేస్తున్నారు.

–సీఆర్.రాజగోపాల్, హంద్రీ–నీవా ఎస్ఈ, మదనపల్లె

ఫ్రీహోల్డ్‌లో 8 వేల ఎకరాల్లో అనర్హులు


తహసీల్దార్, డీటీ, ఆర్ఐలతో సమీక్షిస్తున్న సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

బి.కొత్తకోట: మదనపల్లె డివిజన్‌లో ఇప్పటిదాక నిర్వహించిన ఫ్రీహోల్డ్ వెరిఫికేషన్‌లో 8 వేల ఎకరాల్లో అనర్హులు ఉన్నట్టు వెలుగులోకి వచ్చిందని సబ్ కలెక్టర్ వై.మేఘస్వరూప్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్‌ఓలతో ఫ్రీహోల్డ్ సర్వేపై సమీక్ష నిర్వహించారు. సర్వేలో తలెత్తున్న సమస్యలు, సర్వే విధానంపై ఆయన అవగాహన కల్పించి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ డివిజన్‌లో 42వేల ఎకరాల భూమి ఫ్రీహోల్డ్ చేశారన్నారు. గత ప్రభుత్వంలో జారీ అయిన ఉత్తర్వుల మేరకు 2003 నాటికి, అంతకుముందు జారీ అయిన డీకేటీ పట్టాలకు 20 ఏళ్లు దాటివుంటే వాటిని ఫ్రీహోల్డ్ చేయాల్సి ఉంటుందన్నారు. దీనికి విరుద్ధంగా, నిషేధిత భూములకు ఫ్రీహోల్డ్ చేసుంటే వాటిని అనర్హత కలిగినవిగా గుర్తిస్తున్నామని చెప్పారు. డివిజన్‌లో 22 వేల ఎకరాలకు సర్వే పూర్తి చేయగా అందులో 8వేల ఎకరాలు నిబంధనలకు లోబడి లేవన్నారు. ప్రధానంగా జారీ అయిన పట్టా విషయంలో రికార్డులను పరిశీలించాక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. డివిజన్‌లో 1,500 ఎకరాల ఫ్రీహోల్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు జరిగాయని, అందులో అనర్హత కలిగిన భూములుంటే వాటిపై ప్రభుత్వ సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని అన్నారు. హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ సమావేశాన్ని త్వరలో నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో దగ్ధమైన రికార్డుల్లో హార్సిలీహిల్స్ రికార్డులకు ప్రమాదం జరగలేదన్నారు. తహసీల్దార్ శ్రీధర్‌రావు, డీటీ అన్సారీ, ఆర్ఐ బాలాజీ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించండి

కడపలో జూనియర్ డాక్టర్ల ఆందోళన


కడప రిమ్స్ ఆవరణలో జూనియర్ డాక్టర్ల ఆందోళన

కడప అర్బన్: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్జికర్ మెడికల్ కళాశాలలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అఘాత్యానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ జిల్లాలోని కడప రిమ్స్ డాక్టర్లు డిమాండ్ చేశారు. కోల్‌కతా సంఘటనలో బాధితురాలికి న్యాయం చేయాలనీ కోరుతూ రిమ్స్ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్లు ఆందోళనను కొనసాగించారు. ఇందులో భాగంగా శుక్రవారం జూనియర్ డాక్టర్లు రిమ్స్ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి ఆధునికయుగంలో మహిళలకు రక్షణ లేకపోవడం బాధాకరమన్నారు. నేటి సమాజంలో మహిళలకు భద్రతా లేకుండా పోయిందన్నారు. సభ్యసమాజం సిగ్గుపడేలా కోల్‌కతా సంఘటన జరిగిందన్నారు. దారుణమైన ఘటనకు కారణమైన వారిని శిక్షించడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరుగకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు.

గండికోట జలాశయానికి కృష్ణాజలాలు

కొండాపురం: నంద్యాల జిల్లా అవుకు రిజర్వాయర్ నుంచి గాలేరు– నగరి సృజల స్రవంతి ప్రధానకాలువ ద్వారా కృష్ణాజలాలు 10,500 క్యూసెక్కులు వస్తున్నట్లు జలవనరులశాఖ డీఈ ఉమామహేశ్వర్లు శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయానికి గండికోటకు 7 టీఎంసీలు చేరుతాయన్నారు. గండికోట ప్రాజెక్ట్ పూర్తిసామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం నీరు రావడంతో జలకళ సంతరించుకుంది.

గట్టి ఇడ్లీలు... నూనె కారుతున్న పూరీలు

- తొలిరోజే.. రుచిలేని ఆహారపదార్థాల వడ్డింపు
- అన్నా క్యాంటీన్ టిఫిన్‌పై అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రజలు
- 115 కి.మీ.లోని కుప్పం నుంచి మదనపల్లెకు ఆహారపదార్థాల రవాణా



మధ్యాహ్నభోజనం కోసం ఎండలో వేచి ఉన్న పేదలు, అన్నా క్యాంటీన్‌లో తొలిరోజు వడ్డించిన రుచి, నాణ్యత లేని ఆహారపదార్థాలు

మదనపల్లె: రాళ్ల లాంటి గట్టి ఇడ్లీలు... నూనె కారుతూ, పచ్చిగా ఉన్నటువంటి పూరీలు.. రుచి పచీ లేని సాంబార్. ఇదీ తొలిరోజు అన్నమయ్య జిల్లా మదనపల్లె అన్నా క్యాంటీన్‌లో వడ్డించిన టిఫిన్ మెనూలోని పదార్థాల నాణ్యత. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక..ఎన్నికల హామీ నిలబెట్టుకునే క్రమంలో ఆగస్ట్ 16 నుంచి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన అన్నా క్యాంటీన్‌లు తొలిరోజే ప్రజలను నిరాశపరిచాయి. రూ.5కే ఇడ్లీ, పూరీ తినవచ్చని ఎంతో ఆశగా వెళ్లిన వారు పదార్థాల నాణ్యత, రుచిని చూసి పెదవి విరిచారు. వడ్డించిన పదార్థాల్లో కేసరి స్వీట్ మాత్రమే బాగుందని, మిగిలినవి వేడిగా ఉండకపోగా, చల్లగా ఉండటంతో ఎప్పుడు తయారుచేశారో అని అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయమై అన్నా క్యాంటీన్ సూపర్‌వైజర్‌ని అడిగితే...తమకు ఆహారపదార్థాలు 115 కిలోమీటర్ల దూరంలోని చిత్తూరుజిల్లా కుప్పం నుంచి వస్తున్నాయన్నారు. అక్కడి నుంచి ఇక్కడకు వచ్చేందుకు కనీసం మూడు గంటల సమయమైనా పడుతుందని చెప్పుకొచ్చారు. చెప్పినట్లుగానే మధ్యాహ్నం .12.30 గంటలకు భోజనం వడ్డించాల్సి ఉండగా, వ్యాన్ రాక ఆలస్యమవడంతో సంతగేటు అన్నాక్యాంటీన్‌లో ముప్పావుగంటకు పైగా ఆలస్యంగా ప్రారంభించారు. భోజనం తినేందుకు ఎంతో ఆశగా, ఆకలితో వచ్చిన పేదలు...ఎర్రటి ఎండలో ముప్పావుగంటకు పైగా క్యూలో నిల్చుని ఎదురుచూశారు. తొలిరోజు అన్నా క్యాంటీన్‌లో ఆహారపదార్థాల వడ్డింపు, పదార్థాల నాణ్యతపై మున్సిపల్ ఆర్డీ పీ.వి.వి.ఎస్.మూర్తి, రాజంపేట పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు పరిశీలించారు.

అన్నమే రాలేదు



గతంలో 12 గంటలకే మధ్యాహ్న భోజనం పెట్టేవారు. ఇప్పుడు 1 గంట అయినా అన్నం రాలేదు. ఆకలిగా ఉంది. అందుకే వెళ్లిపోతున్నాం.

– కృష్ణానాయక్, అనంతపురం

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లె ఎక్సైజ్ పరిధిలోని లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు మండలాల పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా శుక్రవారం మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఇసుకను పోలీస్ స్టేషన్‌లో అప్పగించామని ఆయన పేర్కొన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ జబీవుల్లా, సిబ్బంది మోహన్‌రెడ్డి, నాగరాజు, ఈసీ నాగేంద్ర పాల్గొన్నారు.

మదనపల్లెలో..

మదనపల్లె : అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. శుక్రవారం మండలంలోని చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సమీపంలో కొందరు ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో, తాలూకా పోలీసులు దాడి చేసి మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. తదుపరి చర్యల నిమిత్తం ట్రాక్టర్ యజమాని, డ్రైవర్ల వివరాలతో ట్రాక్టర్లను మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు వివరించారు.

డ్రిప్ వైర్ల దొంగల అరెస్ట్

ములకలచెరువు : మండల వ్యాప్తంగా వ్యవసాయ బోర్ల వద్ద పంటల కోసం అమర్చిన డ్రిప్ వైర్లను నెల రోజులుగా గుర్తు తెలియని దుండగులు దొంగలించారు. దీనిపై రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మదనపల్లి పీకే కాలనీకి చెందిన ఆవుల రాజు(30), గాలివీడుకు చెందిన ఆవుల తిరుపాల్(21)లు వాడిన డ్రిప్పు పరికరాలు, వైర్లతో టాటా ఏస్ వాహనంలో వస్తుండగా కదిరి రోడ్డులో వారిని వాహనంతో సహా అరెస్ట్ చేసినట్లు సీఐ తమ్మిశెట్టి మధు, ఎస్సై గాయత్రి శుక్రవారం తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో వారి అరెస్టు చూపించారు. ఒక టాటా ఏస్ వాహనం, 54 కట్టల డ్రిప్ వైర్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను రిమాండ్ తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

మదనపల్లె : ప్రేమిస్తున్నానని చెప్పి ఓ మైనర్ బాలికను మోసం చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మండలంలోని వలసపల్లి పంచాయతీ నవోదయ కాలనీకి చెందిన సయ్యద్ అలీఖాన్ కుమారుడు సయ్యద్ బాషా (22), కొత్తపల్లి పంచాయతీ ఎలకపల్లి కుంటకు చెందిన ఇంటర్మీడియెట్ చదువుతున్న ఓ మైనర్ బాలికను గత సంవత్సర కాలంగా ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడు. పెళ్లి చేసుకుంటానంటూ మాయమాటలు చెప్పి బాలికను మోసం చేశాడు. ఈ విషయమై బాధిత మైనర్ బాలిక కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం స్థానిక తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

పెండ్లిమర్రి : వేర్వేరు ప్రాంతాల్లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలయ్యాయి. పెండ్లిమర్రి మండల పరిధి కడప-పులివెందుల ప్రధాన రహదారిలోని కొత్త గంగిరెడ్డిపల్లె వద్ద కారు టైరు పగిలి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో చక్రాయపేటకు చెందిన వి.వేణుగోపాల్‌రెడ్డికి గాయాలు అయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

టెంపో వాహనం ఢీకొని..

ఒంటిమిట్ట : మండలంలోని కొత్తమాధవరం, కడప-చెన్నై జాతీయ రహదారిపై శుక్రవారం టెంపో వాహనం ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. కడప-చెన్నై జాతీయ రహదారిపై రాజంపేట వైపు వెళ్తున్న గోధుమ పిండి టెంపో వాహనం స్పీడ్ బ్రేకర్ వద్ద స్లో అవగానే.. వెనుక వైపు బైక్‌లో వస్తున్న మన్నూరు మండలం మందరం గ్రామానికి చెందిన శంకర్ రాజు ఢీకొట్టాడు. దీంతో అతనికి గాయాలు అయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తిని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

మైలవరానికి గండికోట నీరు ఎప్పుడో..!

- నాడు గండికోటతోపాటే మైలవరంలోనికి..
- నేడు గండికోటకు కృష్ణా జలాలు వస్తున్నా మైలవరంలోకి రాని వైనం



మైలవరం జలాశయం

జమ్మలమడుగు : శ్రీశైలం ప్రాజెక్టుకు వరద నీటి ప్రవాహం ఇంకా కొనసాగుతోంది. అలాగే తుంగభద్ర జలాశయం గేటు కొట్టుకోవడంతో.. తుంగభద్ర నీరు కూడా శ్రీశైలం వైపు పరుగులు పెడుతోంది. ప్రస్తుతం అవుకు జలాశయం నుంచి రోజూ గండికోట జలాశయానికి 11 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం గండికోట జలాశయంలో ఐదు టీఎంసీల కంటే ఎక్కువ నీరు వచ్చి చేరింది. ఇంకా నీరు వస్తూనే ఉంది. గండికోట పూర్తి సామర్థ్యం 26.87 టీఎంసీలు. ఈ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండిన తర్వాత వామికొండ, సర్వారాయ సాగర్ ప్రాజెక్టులకు గాలేరు-నగరి కాలువ ద్వారా నీటి మళ్లింపు జరుగుతుంది. అలాగే ఎత్తిపోతల పథకం ద్వారా పైడిపాళెం, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లకు నీటి పంపింగ్ జరుగుతుంది.

మైలవరంలో అర్ధ టీఎంసీ మాత్రమే నీరు

శ్రీశైలం నుంచి అవుకు రిజర్వాయర్‌కు నీటిని వదిలి.. అక్కడి నుంచి గండికోట ప్రాజెక్టుకు వదిలేవారు. గండికోటకు వచ్చే నీటిని లింగాపురం టన్నెల్ వద్ద స్లూయిస్ ఏర్పాటు చేసి.. అక్కడి నుంచి నేరుగా మైలవరం జలాశయంలోకి ప్రవహించే విధంగా ప్రతిపాదనలు ఉంచారు. దీంతో లింగాపురం టన్నెల్ వద్ద నుంచి గాలేరు-నగరి వరద కాలువ ద్వారా మైలవరంలోకి మళ్లించే వారు. ఈ నీరు గురప్పకోన వద్ద ఉన్న చెరువులో పడి అక్కడి నుంచి నేరుగా మైలవరం జలాశయంలోకి చేరుతుంది. దీంతో కొంత వరకు స్థానిక రైతులతో పాటు మైలవరం జలాశయంపైన ఆధారపడిన కర్షకులకు సైతం సాగునీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేది. ప్రస్తుతం అటువంటి పరిస్థితి కనిపించడం లేదు. నేరుగా అవుకు రిజర్వాయర్ నుంచి గాలేరు-నగరి వరద కాలువ ద్వారా గండికోట జలాశయంలో పడుతున్నాయి. ప్రస్తుతం మైలవరం జలాశయంలో అర్ధ టీఎంసీ కంటే ఎక్కువ నీరు మాత్రమే ఉంది. ఈ నీటిని ప్రొద్దుటూరు, జమ్మలమడుగు మున్సిపాలిటీలతోపాటు మైలవరం, పెద్దముడియం ప్రజలు తాగునీటి అవసరాల కోసం ఉపయోగించుకుంటున్నారు.

75 వేల ఎకరాల ఆయకట్టు

మైలవరం జలాశయం కింద 75 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ప్రాజెక్ట్ పూర్తి స్థాయిలో నిండితే ఉత్తర కాలువ, దాని ఉప కాలువలైన నొస్సం బ్రాంచ్, టంగుటూరు, పెద్దపసుపల, దేవగుడి బ్రాంచ్ కెనాల్స్ ద్వారా పంట పొలాలకు నీటిని మళ్లించేవారు. దక్షిణ కాలువ ద్వారా ఎర్రగుంట్ల, కమలాపురం ప్రాంతాల రైతులు మైలవరం నీటిని ఉపయోగించుకుంటున్నారు. మైలవరం జలాశయం సామర్థ్యం 6.5 టీఎంసీలు మాత్రమే ఉంది. ప్రస్తుతం అర్ధ టీఎంసీ కంటే ఎక్కువ నీరు ఉంది. గండికోట నుంచి అధికారులు మైలవరం జలాశయంలోనికి నీటిని ఎప్పుడు వదులుతారో అని రైతులు ఎదురు చూస్తున్నారు.

మైలవరం జలాశయాన్ని నింపాలి



గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయంలోనికి నీటిని నింపాలి. ప్రస్తుతం ప్రాజెక్టులో తక్కువ స్థాయిలో నీరు ఉంది. రాబోయే రోజుల్లో కమలాపురం, ఎర్రగుంట్ల ప్రజల తాగునీటి అవసరాలతోపాటు పంట పొలాలకు నీరు అందించే విధంగా ఉండాలి. ప్రస్తుతం దక్షిణ కాలువ కింద పంట సాగు చేసుకునే అవకాశం లేదు. కాబట్టి వీలైనంత త్వరగా మైలవరం జలాశయాన్ని కృష్ణా నది జలాలతో నింపాలి.

– సంబటూరు ప్రసాద్‌రెడ్డి, మాజీ హార్టికల్చర్ చైర్మన్

మరో రెండు రోజుల్లో స్పష్టత వస్తుంది

గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయంలోనికి నీటి విడుదలపై మరో రెండు రోజుల్లో స్పష్టత వస్తుంది. ఇప్పటికి అయితే నీటి విడుదలపై మాకు ఎలాంటి సమాచారం లేదు.

– గౌతంరెడ్డి, ఏఈ, మైలవరం ప్రాజెక్టు

మహిళలపై దౌర్జన్యం

– ఐదుగురిపై కేసు నమోదు

కలసపాడు : మండలంలోని మామిళ్ళపల్లె వద్దకు గురువారం రాత్రి కారులో వెళుతున్న మహిళలపై దౌర్జన్యం చేసి అసభ్యంగా ప్రవర్తించిన ఐదుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఎస్ఐ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాత్రి లింగారెడ్డిపల్లెలో జరుగుతున్న ఓ వివాహానికి మహానందిపల్లె గ్రామానికి చెందిన నలుగురు మహిళలు, మరో ఇద్దరు వ్యక్తులు కారులో వెళుతుండగా మామిళ్ళపల్లె వద్ద ద్విచక్ర వాహనాలు రహదారికి అడ్డంగా ఉండటంతో.. పక్కకు తీయాలని కారులో ఉన్న వారు చెప్పారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రాఘవ, కొవ్వూరు సుధాకర్, పెట్లు భరత్, పంజగల ఓబయ్య, రంతుల్లా అనే యువకులు కారులోని మహిళలపై దౌర్జన్యం చేయడంతోపాటు అసభ్యకరంగా ప్రవర్తించారు. వారు భయంతో కేకలు వేయడంతో సమీప గ్రామంలోని ప్రజలు వచ్చారు. యువకులు చంపుతామని బెదిరించి అక్కడి నుంచి వెళ్లారు. ఈ మేరకు బాధితురాలు సావిత్రి శుక్రవారం ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. వీరిలో ముగ్గురు యువకులపై ఇది వరకే స్థానిక పోలీసుస్టేషన్‌లో వివిధ కేసులు ఉన్నట్లు సమాచారం.


మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టాలి



నిరసన తెలుపుతున్న ఏపీ మహిళా సమాఖ్య నాయకులు, మహిళలు

రామాపురం : దేశవ్యాప్తంగా మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అన్నమయ్య జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు నంద్యాల సరోజనమ్మ, సుమిత్రమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సమాఖ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు కేంద్రం ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా తీసుకువచ్చిన భేటీ పడావో భేటీ బచావో అంశం నినాదంగానే మిగిలింది, తప్పితే దాని వల్ల ఎలాంటి రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రతి రోజు ఎక్కడో ఒక్క చోట ఏదో ఒక రూపంలో అఘాయిత్యాలు, మానభంగాలు, మారణ హోమాలు, జరుగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. మొన్న నంద్యాలలో జరిగిన సంఘటన మరువక ముందే విజయనగరం జిల్లా పసికందుపై అఘాయిత్యానికి ఒడికట్టిన నరరూప రాక్షసుడిని నడిరోడ్డుపై ఉరి తీయాలని, లేకపోతే జీవితమంతా కఠినమైన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. మన రాష్ట్రం, దేశంలో మళ్లీ ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠినతరమైన చట్టాలు తీసుకొని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సుబ్బమ్మ, మల్లిక, కుమారి, గంగోజమ్మ, మహిళలు పాల్గొన్నారు.

నేడు గండిలో రెండో శ్రావణ శనివారోత్సవం





శ్రీ వీరాంజనేయస్వామి మూలవిరాట్, విద్యుత్ కాంతులతో అలరారుతున్న గండి ఆలయం

చక్రాయపేట : గండి పుణ్యక్షేత్రంలోని వీరాంజనేయ స్వామి సన్నిధిలో నేడు రెండో శ్రావణమాస శనివారోత్సవం జరగనుంది. గత వారం కంటే భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుందని భావించిన ఆలయ వర్గాలు అందుకు సరిపడా ఏర్పాట్లు చేశారు. గత వారంలో తలెత్తిన చిన్న చిన్న లోపాలను సరిదిద్ది ఉత్సవాలకు తగు ఏర్పాట్లు చేశామని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. భక్తుల అంచనాల మేరకు లడ్డూ, పులిహోర ప్రసాదాలను సిద్ధ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 3 గంటలకు సుప్రభాతసేవ, ఉత్సవమూర్తులకు అభిషేకం (ఏకాంతంగా), అలంకరణ, ఆరాధన, 5 గంటలకు మహామంగళ హారతి, అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనం ఉంటుందని ఆలయ ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు తెలిపారు. రాత్రి బస చేయు భక్తులకు కాలక్షేపం నిమిత్తం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా భక్తులు అధికారులు సహకరించాలని ఆయన కోరారు.

భారీ వాహనాలకు అనుమతి లేదు

గండిలోకి భారీ వాహనాలను అనుమతించబోమని ఆర్కే వ్యాలీ ఇన్‌చార్జి సీఐ సురేష్‌రెడ్డి(వేంపల్లె సీఐ) తెలిపారు. లారీలు, టిప్పర్లు తదితరాలు వేంపల్లె వైపు నుంచి వచ్చే వాటిని ఇడుపులపాయ క్రాస్ వద్ద, రాయచోటి వైపు నుంచి వచ్చే వాటిని అద్దాలమర్రి క్రాస్ వద్ద ఆపేస్తామన్నారు. బస్సులు, కార్లు తదితరాలను భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకొని తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఉత్సవాల సందర్భంగా సీఐలు, ఎస్సైలతోపాటు సుమారు 130 మంది వరకు సిబ్బందితో బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.

రక్తదాన శిబిరం

గండిలో రక్తదాన శిబిరాన్ని కడప రిమ్స్ వారి సహకారంతో ఏర్పాటు చేస్తున్నామని ట్రిపుల్ ఐటీకి చెందిన ప్రసాద్ తెలిపారు. రక్తదాతలు ముందుకు వచ్చి సహకరించాలని ఆయన కోరారు.

ఎండలకు పంటలు కాపాడుకునేందుకు జాగ్రత్తలు



నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి

కడప అగ్రికల్చర్ : వైఎస్ఆర్ జిల్లాలో ఖరీఫ్ -2024 జూన్ మాసంలో సాధారణ వర్షపాతం కంటే మించి వర్షాలు కురిశాయని, దీంతో చాలా మంది రైతులు వర్షాధార పంటలైన వేరుశనగ, మినుము, కంది, పత్తి, కొర్ర పంటలను సాగు చేశారని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. అయితే జూలై, ఆగస్టు మాసాల్లో ఏర్పడిన వర్షాభావం కారణంగా జిల్లాలోని కొన్ని గ్రామాల్లో సాగులో ఉన్న పంటలు నీరు లేక వాడిపోయే స్థితిలో ఉన్నాయని, వాటిని కాపాడుకునేందుకు రైతులు కొన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

- 20 గ్రాముల యూరియా ఒక లీటరు నీటికి కలిపి ఎకరాకు పిచికారి చేసుకోవాలి.
- నానో యూరియా రెండు మిల్లీమీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.
- 13:00:45 పొటాషియం నైట్రేట్ ఎరువును 5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకుంటే కొద్ది రోజుల వరకు పంటలను కాపాడుకోవచ్చు.
- 5 గ్రాముల 19:19:10 ఎరువును ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. దీనిని పూత దశ ముందు ఉన్న పంటలపై ప్రయోగించాలి.

ప్రజలకు బాబు ఆశ చూపి మోసం



బాధితుడికి చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల, నాయకులు

- పథకాలు అమలు చేయని సీఎం
- మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : గడిచిన రెండు, మూడు రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాటలు చూస్తుంటే.. పథకాలను పక్కనపెట్టి విరాళాలు సేకరించే పనిలో పడి ట్రస్టు నడిపిస్తున్నట్లు ఉందని మాజీ ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. స్థానిక కార్యాలయంలో ఆయన శుక్రవారం మాట్లాడారు. ఎన్నికల ముందు పేద ప్రజలకు ఆశ చూపి నమ్మించి ఓట్లు వేశాక పథకాలు అమలు చేయకుండా.. అమరావతి, ఆరోగ్యశ్రీ హాస్పిటళ్లు, అన్నా క్యాంటీన్‌ల పేరుతో విరాళాలు సేకరిస్తూ ట్రస్టును నడుపుతున్నట్లు ఉందని అన్నారు. మాయ మాటలు చెప్పడం చంద్రబాబుకు అలవాటుగా మారిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు పథకాలు అమలు చేసి వారిలో ఆత్మస్థైర్యం నింపితే... చంద్రబాబు పథకాలు అమలు చేయకుండా అన్నాక్యాంటీన్‌లు పెట్టి పేద ప్రజలను చిన్నచూపు చూస్తున్నారని పేర్కొన్నారు. ఉన్న పథకాలు ఆపేసి ఒక్క పథకం కూడా అమలు చేయకుండా.. అప్పుల పేరు చెప్పి తప్పించుకోవాలంటే ప్రజలకు జవాబు చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆగస్టు 15న ఏ ముఖ్యమంత్రి అయినా పథకాలు ప్రారంభిస్తారని తెలిపారు. కానీ ఈ ముఖ్యమంత్రి విరాళాలు సేకరించి అన్నా క్యాంటీన్ పెట్టడం సిగ్గుచేటని తెలిపారు. మేధావులు ఇప్పటికైనా చంద్రబాబు నైజం అర్థం చేసుకోవాలని తెలిపారు. సూపర్ సిక్స్ పేరు చెప్పి ప్రజలను వాడుకుని వదిలేశారని పేర్కొన్నారు. అసత్యాలు చెప్పి కూటమి నాయకులను, ప్రజలను అందరినీ కరివేపాకులాగా వాడుకున్నారని పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట చెబితే మాట తప్పడని అర్థం చేసుకోవాలన్నారు. బంగారు లాంటి జగన్‌ను వదులు కొన్నందుకు ప్రజలు బాధపడుతున్నారని పేర్కొన్నారు.

టీడీపీ బాధితుడికి జగన్ అండ

పెనగలూరుకి చెందిన నాగేంద్రబాబు కడపలో ఆటో తోలుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు టీడీపీ మూకలు నాగేంద్రబాబు ఆటోను అల్లర్లలో కాల్చి వేశారు. ఈ విషయం తెలిసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ద్వారా బాధితుడికి లక్ష రూపాయల సాయం అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, పంజం సుకుమార్‌రెడ్డి, సీహెచ్ రమేష్, రుద్దిరాల రమణ, కరీముల్లా, మల్లి, రాజ, దమ్ము రఘు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో వడ్డెరలు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని అజయ్ రెసిడెన్సీలో వడ్డెరల చైతన్య సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వడ్డెరలు అన్ని రంగాల్లో వెనుకబడ్డారన్నారు. వారిని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వడ్డెర విద్యావంతుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు టి.ఈశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వడ్డెర్లు 50 లక్షల మంది జనాభా ఉన్నా.. శాసనసభలో ప్రాతినిధ్యం వహించేందుకు ఒక్కరూ లేకపోవడం బాధ కలిగించే అంశమన్నారు. ఇకముందైనా వడ్డెర ప్రజాప్రతినిధుల గొంతుక శాసనసభలో వినిపించేలా చూడాల్సిన బాధ్యత అన్ని పార్టీల నేతలపై ఉందన్నారు. వడ్డెర విద్యావంతుల వేదిక గౌరవ అధ్యక్షుడు దేరంగుల రమణయ్య, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో తప్ప మిగిలిన రాష్ట్రాలలో వడ్డెరలు ఎస్సీ, ఎస్టీల జాబితాలో కొనసాగుతున్నారన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి వడ్డెరలను ఎస్టీ జాబితాలోకి చేర్చేలా చూడాలంటూ విజ్ఞప్తి చేశారు. వడ్డెరలకు దక్కాల్సిన క్వారీలు బినామీల పేర్లతో పెత్తందార్ల చేతిలో ఉండడం దారుణమన్నారు. అర్హులైన వడ్డెరలకే క్వారీలు దక్కేలా చూడాలంటూ కోరారు. కార్యక్రమంలో వడ్డెర విద్యావంతుల వేదిక నేతలు చంద్రశేఖర్, మారుతీశంకర్, జీవానందం, చల్లా రెడ్డెయ్య, కడప రమణయ్య, కోటేశ్వరరావు, డాక్టర్ లక్ష్మీప్రసాద్, సర్పంచ్ వాసుదేవలతోపాటు పలు మండలాలకు చెందిన వడ్డెర నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆరు నెలలుగా నిరీక్షణ

- కారు అమ్మినా.. ఉన్నట్లు చూపుతున్న వైనం
- సాంకేతిక లోపాలు సవరించాలని బాధితుడి వేడుకోలు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరుకు చెందిన ఖామూషావలి అనే వ్యక్తి స్థానికంగా పంచర్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ అవసరాల కోసం 16 ఏళ్ల క్రితం ఓ అంబాసిడర్ కారును కొనుగోలు చేశాడు. అయితే సదరు కారును ఆరు నెలల క్రితం మదనపల్లికి చెందిన ఓ డ్రైవింగ్ స్కూల్ యజమానికి విక్రయించాడు. కొనుగోలు చేసిన వ్యక్తి కూడా సదరు కారు పాతబడి పోయినందున పాత ఇనుప సామాన్ల (గుజిరీ) అంగడిలో అమ్మేశాడు. ఖామూషావలికి నాలుగు చక్రాల వాహనం ఉన్న కారణంగా ఇన్నాళ్లూ ఎలాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందలేక పోయాడు. ఈ నేపథ్యంలో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే సంక్షేమ పథకాలు వస్తాయనే ఆలోచనతో.. ఆరు నెలల క్రితం స్థానికంగా ఉండే గ్రామ సచివాలయానికి వెళ్లి ఆన్‌లైన్‌లో ఉన్న తన కారు వివరాలను తొలగించేందుకు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదు. మదనపల్లిలోని ఆర్టీవో కార్యాలయానికి వెళ్లి తన గోడును వెళ్లబోసుకుంటే సదరు కారు రోడ్డు మీద ఎక్కడా తిరగడం లేదని అధికారులు నిర్ధారించారు. సచివాలయంలో మాత్రం ఇతడి ఆధార్ కార్డు నంబర్ నమోదు చేస్తే మాత్రం ఇంకా నాలుగు చక్రాల వాహనం ఉన్నట్లే వస్తోందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు సచివాలయ ఆన్‌లైన్‌లో కనపరుస్తున్న తన వివరాలను తొలగించి పుణ్యం కట్టుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

మదనపల్లె టీడీపీలో ముదిరిన విభేదాలు



ఎమ్మెల్యేపై టీడీపీ జిల్లా అధ్యక్షుడికి ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ అనుచరులు

- ఎమ్మెల్యే ఏకపక్ష వైఖరిపై ఫిర్యాదులు
- కార్యకర్తలు, నాయకులకు విలువ ఇవ్వడం లేదంటూ అసంతృప్తి
- అన్నా క్యాంటీన్ సాక్షిగా ప్రారంభమైన లుకలుకలు

మదనపల్లె : అధికారంలోకి వచ్చిన 60 రోజులకే మదనపల్లె టీడీపీలో విభేదాలు మొదలయ్యాయి. కష్టకాలంలో పార్టీ జెండా మోసి, కేసులు పెట్టించుకుని, జైలుకు వెళ్లి బాధలు పడ్డ తమను కాదని, కొత్తగా వచ్చిన వారికే ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని రాజంపేట పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఎదుట మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ అనుచరులు గోడు వెళ్లగక్కారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఏకపక్ష వైఖరిపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిందన్న మాటే కానీ, ఏ మాత్రం విలువ లేకుండా పోయిందని వాపోయారు. శుక్రవారం జరిగిన అన్నా క్యాంటీన్‌ల ప్రారంభోత్సవానికి క్యాడర్‌కు ఆహ్వానం అందకపోవడమే దీనికి కారణం... టీడీపీలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా రాకను తొలినుంచి వ్యతిరేకిస్తున్న ఓ వర్గం వేగంగా పావులు కదుపుతోంది. ఏడాది క్రితం పార్టీలో చేరి అదృష్టవశాత్తు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన.. కేవలం 10 మందిని వెనక వేసుకుని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా వైఖరిపై అధిష్టానానికి ఫిర్యాదు చేయడంతోపాటు బహిరంగంగానే ఆయన వ్యవహారశైలిపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో క్యాడర్‌కు సర్దిచెప్పే క్రమంలో శుక్రవారం జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజును మదనపల్లెకు పంపి దిద్దుబాటు చర్యలకు పార్టీ ఉపక్రమించింది. రాజంపేట పార్లమెంటరీ టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో... పార్టీ కార్యకర్తలదని, కష్టపడిన వారికే గుర్తింపు ఇస్తుందని, నాయకుల చుట్టూ తిరుగుతూ, షో చేసే వ్యక్తులకు పదవులు రావని వ్యాఖ్యానించారు. శుక్రవారం జరిగిన అన్నా క్యాంటీన్‌ల ప్రారంభోత్సవంలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు పాల్గొన్నా, ఎమ్మెల్యేతో ఎడముఖం, పెడముఖంగానే వ్యవహరించారు. పార్టీ అధ్యక్షుడికి ఫిర్యాదు చేసిన వారిలో మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ అనుచరులు దేవరింటి శ్రీనివాసులు, మేకలరెడ్డి శేఖర్, భవానీప్రసాద్ కీలకంగా ఉన్నారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే అధికార పార్టీలో ముదురుతున్న విభేదాలు, వర్గపోరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రెండు వర్గాల మధ్య పోరుతో ఎటువైపు నడవాలో తెలియక కార్యకర్తలు సతమతమవుతున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళలు అదృశ్యం



జయశ్రీ (ఫైల్)

రామాపురం : అన్నమయ్య జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళలు అదృశ్యమయ్యారు. రామాపురం మండల కేంద్రంలోని పాత రామాపురానికి చెందిన కొరివి జయశ్రీ(20) కనిపించడం లేదని ఆమె భర్త గంగాధర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జయశ్రీ బుధవారం ఉదయం బంగారు కొనుగోలు చేయడానికి రాయచోటికి వెళ్లింది. సాయంత్రానికి కూడా ఇంటికి రాకపోవడంతో ఆమె కోసం భర్త గాలించాడు. అతనికి ఎటువంటి సమాచారం తెలియకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్ శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు.

కర్ణాటకకు వెళ్లి..



నౌజియా (ఫైల్)

రామసముద్రం : మండలంలోని ఊలపాడు గ్రామానికి చెందిన బాబాజాన్ భార్య నౌజియా, ఆమె కుమార్తె షాఫియా అదృశ్యమయ్యారు. వివరాలిలా ఉన్నాయి. నౌజియా గురువారం ఒక ప్రైవేటు బస్సులో కర్ణాటక రాష్ట్రం ముళబాగిల్‌లోని బంధువుల ఇంటికి వెళ్లింది. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచాఫ్ అయ్యింది. బంధువులను విచారణ చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె భర్త పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

మైనర్ బాలిక..

బి.కొత్తకోట : మైనర్ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రెడ్డప్పనాయక్ శుక్రవారం తెలిపారు. మండలంలోని గట్టుకు చెందిన బాలిక గురువారం ఇదే మండలంలోని వేమలేటికోటలో ఉంటున్న అక్క ఇంటికి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో పలు చోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీనిపై తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్

దువ్వూరు : మండలంలోని చిన్నసింగనపల్లె గ్రామానికి చెందిన ఐ.బాల వీరారెడ్డి అక్రమంగా మద్యం అమ్ముతుండటంతో అతనిని అరెస్టు చేసి 24 క్వార్టర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సహకారం

వేముల : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు యూసీఐఎల్ ఆధ్వర్యంలో పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తుమ్మలపల్లె యురేనియం ప్రాజెక్టు జీఎం ఎం.ఎస్.రావు పేర్కొన్నారు. వేములలోని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాల, బెస్తవారిపల్లెలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలకు వంట సామగ్రి, ఆటవస్తువులు, మెడికల్ సామగ్రిని శుక్రవారం యురేనియం ప్రాజెక్టు ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా పాఠశాలలకు రూ.23 లక్షల సీఎస్ఆర్ నిధులతో జనరేటర్, కంప్యూటర్, ప్రింటర్, వంట పాత్రలు, మిక్సీలు, ఫ్రిజ్, వాలీబాల్స్, ఫుట్‌బాల్స్, క్రికెట్ కిట్స్, యోగా మ్యాట్స్, జావలిన్ త్రో తదితర వస్తువులను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో సుమన్ సర్కార్, డీజీఎం భగత్, సీఎస్ఆర్ అధికారి నవీన్‌కుమార్‌రెడ్డి, కోఆర్డినేటర్ గంగిరెడ్డి, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్ శారద పాల్గొన్నారు.